క్లుప్తంగా

డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

జిల్లా మలేరియా అధికారి తులసి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసి

ఉక్కునగరం: జిల్లాలో డెంగ్యూ, మలేరియా జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి అన్నారు. ఆమె సోమవారం ఉక్కు జనరల్ ఆస్పత్రి, అగనంపూడి ఏరియా ఆస్పత్రి, కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి, అక్కడి ల్యాబ్‌లను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ నిర్ధారణకు చేస్తున్న పరీక్షలను తనిఖీ చేశా రు. జ్వర పీడితులకు మలేరియా, డెంగ్యూ లక్ష ణాలుంటే తక్షణమే ఆయా పరీక్షలు చేయాలని ఆమె ఆదేశించారు. వైద్యాధికారులను కలిసి రోగుల పట్ల అప్రమత్తంగా ఉండి, సకాలంలో వారికి పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

'విలీన కార్మికులను పర్మినెంట్ చేయాలి'

గాజువాక : పంచాయతీలో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తూ, గాజువాక మున్సిపాలిటీలో 2005లో విలీనమైన కార్మికులను పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గాజువాక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులను పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. పర్మినెంట్ చేయని పక్షంలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు, ఉరుకూటి రాజు, టి.నూకరాజు, గొల్ల రాము, గణేష్, నాగరాజు, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ ఫెయిత్ చర్చి వార్షికోత్సవం



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు సూర్య

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు కేవీఎల్ రావునగర్‌లోని హోలీ ఫెయిత్ చర్చి 24వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ నటుడు సూర్య కుమార్, సిస్టర్ శ్రేష్ఠ కర్మోజు హాజరయ్యారు. వారు కేక్ కట్ చేశారు. శ్రేష్ఠ వాక్య సందేశం వినిపించగా, సూర్య జీవిత సత్యాలను వివరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చర్చి పాస్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో సురేఖ, ఉదయ్ కాంతి, చంద్రకాంత్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

రహదారి గోతులమయం



లక్కరాజుపాలెం టీ జంక్షన్ వద్ద ..

అగనంపూడి: అగనంపూడి జాతీయ రహదారి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్, దువ్వాడ గ్రామం, రాజీవ్‌నగర్ వరకు ఉన్న రహదారి ధ్వంసమైంది. అగనంపూడి నిర్వాసిత కాలనీల రింగ్ రోడ్డు మీదుగా టోల్‌గేటును తప్పించుకొనే ప్రయత్నంలో భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గం శిథిలం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఇంటి ముంగిటకే సేవలు

వలంటీర్ల వ్యవస్థపై ప్రజల ప్రశంసలు

వలంటీర్ల వందనం

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై లబ్ధిదారులు ప్రశంసలు కురిపిస్తున్నారు. పేదలు ఎక్కడికీ వెళ్లే అవసరం లేకుండా, అర్హతే ప్రాతిపదికగా పథకాలను ఇంటికే చేరవేయడంతో కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించి, 2,3 రోజుల్లోనే ధ్రువపత్రాలను అందించారని తెలిపారు. గతంలో ఈ పత్రాలు కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరిగేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితే లేదని చెబుతున్నారు. ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలను చేరవేస్తున్న వలంటీర్లను అభినందిస్తున్నారు.

కదల్లేని నాకు ఎంతో సాయం



దివ్యాంగురాలు రమణమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ మంజు

నాకు పుట్టుకతోనే అంగవైకల్యం ఉంది. బయటికి వెళ్లడం చాలా కష్టం. నాకు వలంటీర్ కోన మంజు ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడికీ వెళ్లకుండా, ఒకటో తేదీనే పింఛన్ నగదును ఇంటికే తీసుకువచ్చి ఇస్తున్నారు. ఇటువంటి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– నమ్మి రమణమ్మ, యాదవజగ్గరాజుపేట

ఆస్పత్రికి వచ్చి పింఛన్



కనకమ్మకు ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రేవతి

నాకు టీబీ వచ్చి ఆసుపత్రిలో చేరాను. చేతిలో చిల్లి గవ్వ కూడా లేక ఇబ్బంది పడుతున్న ఆ సమయంలో వలంటీర్ రేవతి ఆసుపత్రికి వచ్చి పింఛన్ నగదును అందజేసింది. అందరూ నా దగ్గరకు రావడానికే భయపడుతున్న తరుణంలో ఆమె వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్లింది. మానవత్వంతో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయం.

– కనకమ్మ, యాదవజగ్గరాజుపేట

కరోనా సమయంలో సేవలు మరువలేం



శ్రీలక్ష్మికి వితంతు పింఛన్‌ను అందిస్తున్న వలంటీర్ దుర్గాదేవి

కరోనా సమయంలో మా వలంటీర్ దుర్గాదేవి ఎన్నో విధాలుగా ఆదుకుంది. స్నేహితులు, బంధువులు కూడా ఎవ్వరూ వచ్చి సహాయం అందించలేని తరుణంలో వలంటీరే మాకు సహాయం అందించారు. నాకు వచ్చే వితంతు పింఛన్‌ను సమయానికి అందించారు. ఎప్పుడు అవసరమైనా వెంటనే స్పందిస్తారు.

– సీహెచ్ శ్రీలక్ష్మి, యాదవజగ్గరాజుపేట

'చేయూత' అందించారు



దేవుడమ్మకు వైఎస్సార్ చేయూత మంజూరు పత్రాలను అందిస్తున్న వలంటీర్ లక్ష్మి

మా ఆదాయం అంతంత మాత్రమే. ఆ సమయంలో వలంటీర్ లక్ష్మి ఇంటికి వచ్చి వైఎస్సార్ చేయూత పథకానికి అర్హత ఉందంటూ నా చేత దరఖాస్తు చేయించింది. ఆ పథకం మంజూరై, ప్రభుత్వం అందించిన నగదు వచ్చింది. నేను పెద్ద చదువులు చదవలేదు. అందుకే చిన్న వ్యాపారమైనా చేయాలనే ఆలోచనతో కిల్లీ షాపు పెట్టుకున్నా. కుటుంబానికి ఎంతో కొంత సాయం అందించగలుగుతున్నా. వలంటీర్ లక్ష్మికి ధన్యవాదాలు. – మడిస దేవుడమ్మ, యాదవ జగ్గరాజుపేట

స్పీడ్ గన్‌తో వేగానికి బ్రేక్

స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు



భారీ వాహనాలకు స్టిక్కర్లు అంటిస్తున్న భద్రతా విభాగం అధికారులు



స్టీల్‌ప్లాంట్‌లో స్పీడ్ గన్‌తో వాహనాలు పరీక్షిస్తున్న భద్రతా విభాగం సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో వాహనాల వేగానికి స్పీడ్ గన్ బ్రేకులు వేస్తోంది. ప్లాంట్‌లో ప్రమాదాల తీవ్రత తగ్గుముఖం పట్టేందుకు ఉక్కు భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు హెల్మెట్ క్యాంపైన్, వెల్డింగ్ సేఫ్టీ క్యాంపైన్, హైట్ వర్క్ క్యాంపైన్, కన్ఫైన్ స్పేస్ సేఫ్టీ క్యాంపైన్ వంటివి జరుగుతుంటాయి. వాటిపై ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతూ దానికి తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇటీవల ప్లాంట్‌లోని వాహనాల వేగ నియంత్రణకు స్పీడ్ గన్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్‌లోని మిల్స్, సెంట్రల్ స్టోర్స్, న్యూస్టాక్ యార్డ్, ఆర్.ఎం.హెచ్.పి. న్యూ ప్లాంట్ ప్లాజా కూడళ్లను ప్రమాద ప్రదేశాలుగా గుర్తించారు. భద్రతా విభాగం సీనియర్ మేనేజర్ పి. కృష్ణమూర్తి నేతృత్వంలో సిబ్బంది, హోం గార్డులు ప్లాంట్‌లోని ముఖ్య కూడళ్ల వద్ద స్పీడ్ గన్‌తో వాహనాల వేగాన్ని గమనిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్లాంట్ లోపల ద్విచక్ర, భారీ వాహనాలకు నిర్దేశించిన 30 కిలోమీటర్ల వేగాన్ని దాటి ప్రయాణిస్తే వారిని ఆపుతున్నారు. వారికి వేగ నియంత్రణపై కౌన్సెలింగ్ చేస్తున్నారు. మూడుసార్లు దాటితే వారికి ఫైన్ విధిస్తున్నారు. వేగ నియంత్రణపై భారీ వాహనాలపై స్టిక్కర్లు అంటిస్తూ, వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ప్లాంట్‌లో అతి వేగ ప్రయాణాలు తగ్గుతున్నట్టు భద్రతా విభాగం అధికారుల సమాచారం.

భద్రతా విభాగానికి సహకరించాలి



ఉద్యోగుల భద్రత లక్ష్యంగా ఉక్కు భద్రతా విభాగం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా అతి వేగ నియంత్రణకు చర్యలు ప్రారంభించాం. ఉద్యోగులు తక్కువ వేగంతో ప్రయాణించడం ద్వారా ప్రమాదాల నివారణకు సహకరించాలి.

-పి.కృష్ణమూర్తి, సీనియర్ మేనేజర్, ఉక్కు భద్రతా విభాగం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ



గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లబ్ధిదారుల సందడి

- హౌస్ కమిటీ పట్టాల కన్వేయన్స్ డీడ్‌లకు క్యూ
- అమావాస్య రోజూ పోటెత్తిన లబ్ధిదారులు

గాజువాక: గాజువాక హౌస్ కమిటీ నిర్మాణాల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ ఆస్తికి కన్వేయన్స్ డీడ్ (రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్) పొందడానికి బారులు తీరుతున్నారు. మూడు రోజుల క్రితం అధికారులు రిజిస్ట్రేషన్లను ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో అర్హులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు భారీగా వస్తున్నారు. హౌస్ కమిటీ పట్టాలతో పాటు అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాలకు సంబంధించి జారీ చేసిన పట్టాలకు కూడా అధికారులు అన్ని హక్కులను కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

48మందికి డీడ్‌లు : హౌస్ కమిటీతో పాటు జీవో నంబర్ 388 ప్రకారం గాజువాకలో పట్టాలు పొందిన వారు 1526 మంది ఉన్నారు. వారికి నగరంలోని ఏడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అధికారులు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో గాజువాక, పెదగంట్యాడ, లంకెలపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం ఒక్కరోజే 48 మందికి సంబంధిత అధికారులు కన్వేయన్స్ డీడ్‌లను నమోదు చేశారు. అమావాస్య అయినప్పటికీ లబ్ధిదారులు భారీగా రావడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. తాము ఈ కార్యాలయాల్లో సోమవారం 200 మందికి కన్వేయన్స్ డీడ్‌లను ఇవ్వాలని నిర్ణయించగా 48 మందికి పూర్తయ్యాయని గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు. మంగళవారం నుంచి మరింత భారీ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు పూర్తవుతాయని పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: గాజువాక స్టీల్‌సిటీ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా చెల్లి రుషికేష్ ఎన్నికయ్యారు. పెదగంట్యాడలోని జీవీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తిరుపతి రావు, కోశాధికారిగా వీటీఎన్ నాయుడు, సభ్యులుగా 14 మంది ఎన్నికయ్యారు. కార్యక్రమానికి హాజరైన జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ నారాయణరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలను కొనియాడారు. క్లబ్ మాజీ డైరెక్టర్ కేవై దాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీతో ప్రమాణం చేయించారు. క్లబ్ ఆధ్వర్యంలో గతేడాది నిర్వహించిన సేవా కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో తెంటు సత్యనారాయణ, కాతా బాలకృష్ణ, దివాకర్, కె.సత్యం బాబు, పి.చంద్రశేఖర్, కె.తిరుపతి, వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్ పరిరక్షణకు సుదీర్ఘ పోరాటం



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, ప్లాంట్ ఉద్యోగులు

కూర్మన్నపాలెం: మహనీయుల త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్మికులు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దేశంలోని ఏ పరిశ్రమలోనూ ఇంతటి సుదీర్ఘ పోరాటం జరిగిన చరిత్ర లేదని, ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉక్కు దీక్షకే ఈ ఘనత దక్కుతుందని కొనియాడారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 886వ రోజు సోమవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఆ కుట్రలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

14వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



శిబిరం వద్ద మాట్లాడుతున్న కొవిరి అప్పలరాజు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు, సీఐటీయూ స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరాన్ని సోమవారం సందర్శించిన నాయకులు, కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మికులకు బేసిక్ రూ.3,700 ఇవ్వడం అన్యాయమన్నారు. డీఏను బేసిక్‌లో కలిపి, రూ.22వేలు బేసిక్ ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.36వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, పల్లేటి పోలయ్య, నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో రాహుల్ గాంధీ స్టీల్‌ప్లాంట్ పర్యటన



పోరాట కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

ఉక్కునగరం: ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ ఆగస్టులో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమ స్థలిని సందర్శిస్తారని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి. రాకేష్ రెడ్డి తెలిపారు. ఉక్కునగరం ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమంలో భాగంగా ఈ నెల 22న పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నేతృత్వంలో జింక్ గేటు నుంచి కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వరకు మార్చ్ నిర్వహించనున్నారన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్.రావు, కాంగ్రెస్ నాయకులు వేగి వెంకటేష్, లక్కరాజు రామారావు, జి. గోవింద్, జెర్రిపోతుల ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

22న సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాదయాత్ర

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 22న సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాదయాత్రను నిర్వహించనున్నట్లు ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోచారెడ్డి రాకేష్ రెడ్డి తెలిపారు. జింక్ గేటు నుంచి కూర్మన్నపాలెంలోని దీక్షా వేదిక వరకు యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. భెల్‌లోని గుర్తింపు యూనియన్ కార్యాలయంలో సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ వేగి వెంకటేష్, స్టేట్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ లక్కరాజు రామారావు, భెల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, స్టీల్‌ప్లాంట్ ఇంటక్ నాయకుడు వేణువర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నకిలీ పోలీసులు

కూర్మన్నపాలెం: పోలీసులమని చెప్పి ఇద్దరు వ్యక్తులను బెదిరించి, వారి వద్ద నుంచి నగదు, వస్తువులను కాజేసిన నలుగురు వ్యక్తులను దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దువ్వాడ లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. ఆదివారం అర్ధరాత్రి రాజీవ్‌నగర్‌కు చెందిన రౌతు వెంకటరమణ, బోర రమేష్, వడ్లపూడి ప్రాంతానికి చెందిన వెంకటరమణ, బొర్ర శ్రీను మద్యం సేవించి వడ్లపూడి జంక్షన్ వద్ద బైక్‌పై వెళ్తున్న వి.అవినాష్‌ను, అతని స్నేహితుడు రవిని అడ్డగించారు. తాము పోలీసులమని చెప్పి వారిని కొట్టి, బెదిరించారు. వారి నుంచి సెల్‌ఫోన్, రెండు వేల రూపాయల నగదు కలిగిన పర్సు, బైక్‌ను బలవంతంగా లాక్కుని, వారిని పోలీస్‌స్టేషన్‌కు రమ్మని చెప్పి అక్కడి నుంచి ఉడాయించారు. దీంతో బాధితులు సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అవినాష్ ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు ఆ నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

25న జిల్లా స్థాయి యోగా పోటీలు

అగనంపూడి: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, అనకాపల్లి ఆధ్వర్యంలో ఈ నెల 25న జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.ఆంజనేయులు తెలిపారు. లంకెలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరవాడ మండలం వెన్నెలపాలెం కల్యాణమండపంలో ఈ పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. బాలబాలికలకు సబ్ జూనియర్ (9 నుంచి 14 సంవత్సరాలు), జూనియర్ (15 నుంచి 18), సీనియర్ (19 నుంచి 28) విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు వచ్చేనెలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయిలో నిర్వహించే ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలియజేశారు. వివరాలకు 97016 58665, 78010 83283 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎం.వి.నాగేశ్వరరావు, పిళ్లా రవిశంకర్, లోవరాజు, అన్నాజీరావు, శ్రీదేవి, రౌతు దేవి తదితరులు పాల్గొన్నారు.

షట్టర్లు విరగ్గొట్టి నాలుగు షాపుల్లో చోరీ



బేకరీలో విరగ్గొట్టిన షట్టర్‌ను చూపుతున్న యజమాని

అక్కిరెడ్డిపాలెం: దుండగులు నాలుగు షాపుల్లో షట్టర్లు విరగ్గొట్టి, నగదు అపహరించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘటనపై గాజువాక క్రైం ఎస్ఐ మహేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక బీసీ రోడ్డులో రెండు మెడికల్ షాపులు, ఒక బేకరీ, ఒక అక్వేరియమ్‌లో అర్ధరాత్రి దొంగలు షాపుల షట్టర్లు విరగ్గొట్టారు. సోమవారం ఉదయం వచ్చి చూసుకున్న ఆయా షాపుల యజమానులు వెంటనే గాజువాక క్రైం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీం వివరాలు సేకరించింది. నాలుగు షాపుల్లో కలిసి సుమారు రూ.15 నుంచి రూ.20 వేల వరకు నగదును అపహరించారని తెలిపారు. గాజువాక క్రైం ఎస్ఐ మహేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

30న సంగీత కళాకారుల సంఘం ఎన్నికలు

మద్దిలపాలెం: విశాఖ సంగీత కళాకారుల సంఘం ఎన్నికలు ఈ నెల 30న నిర్వహించనున్నామని సంఘం కన్వీనర్ చెన్నా తిరుమలరావు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరించనున్నామన్నారు. ఎన్నికల్లో అన్ని అంశాలలో సేవలందిస్తున్న కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. సంఘంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81796 05267 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

కల్యాణం.. కమనీయం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రజలకు ఆహ్లాదకర వాతావరణమే లక్ష్యం



చిన్నారుల క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డులో తీరాన్ని ఆనుకుని ఉన్న లాసన్స్‌బే కాలనీ పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. వేస్టు టు వండర్స్ పేరిట పార్కులో ఆధునికీకరించిన పలు క్రీడా ప్రాంగణాలను మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సోమవారం సాయంత్రం ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే క్రమంలో పార్కులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆలోచనల్లో భాగంగా వేస్ట్ టు వండర్స్ కాన్సెప్ట్‌తో ఈ పార్కులో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేశామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా సేకరించిన వ్యర్థాలను, టైర్లను వినియోగించి అన్ని వయసుల వారికి ఆహ్లాదం పంచే విధంగా పార్కును తీర్చిదిద్దామన్నారు. ప్రారంభం అనంతరం ఆయా క్రీడా, ఆహ్లాదకరమైన సముదాయాలను పరిశీలించారు.

నేరాల నియంత్రణపై మహిళా పోలీసులకు అవగాహన

మల్కాపురం: ఇండస్ట్రియల్ ఏరియాలోని సచివాలయాల మహిళా పోలీసులకు నేరాల నియంత్రణలో మహిళ పోలీసుల ప్రాత అనే అంశంపై మల్కాపురం సీఐ జి.డి.బాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాపురం స్టేషన్ వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో స్టేషన్ పరిధి లోని 25 సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ తమ తమ సచివాలయాల పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు, సంఘ వ్యతిరేక శక్తుల సమాచారం కలిగి ఉండాలన్నారు. వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిత్యం ప్రజలను కలిసి నేరాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలన్న దానిపై అవగాహన కల్పించాలన్నారు.

పబ్లిక్ డిమాండ్

పాడుపడిన బావితో పొంచి ఉన్న ప్రమాదం



పాడుబడిన బావి వద్ద స్థానిక మహిళలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు గొందేశి వీధిలోని పాడుబడిన బావి ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్లు, చేతి బోర్లు రావడంతో 35 ఏళ్ల క్రితం తవ్వించిన ఈ బావి నిరుపయోగంగా మారింది. దీంతో చెత్తాచెదారాలతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. బావి చుట్టూ రక్షణ గోడ చిన్నదిగా ఉండడంతో పిల్లలు ఈ బావి వద్ద ఆటలాడుతూ, అందులోకి ఒంగి చూస్తున్నారు. నిరుపయోగంగా, ప్రమాదకరంగా మారిన ఈ బావిని పూడ్చివేయాలి.